RNI NO. TELTEL/2022/83470
●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి




హైదరాబాద్‌లోపలు చోట్ల ఈదురుగాలుల వర్షం
అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి సూచన

## మరో మూడ్రోజుల పాటు ఉరుములతో వర్షం




## కాంగ్రెస్ అంటేనే కబ్జాలు. కక్షసాధింపులు

నత్తనడకన పనులు సాగుతున్నాయన్న కెటిఆర్

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 3. సంచిక :210 | శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in

## తెలంగాణ పల్లెలకు చేరువగా ఇంటర్నెట్

ప్రతి ఇంటికీ సాంకేతికత చేరాలన్నదే లక్ష్యం
ఐటిశాఖ మంత్రిశ్రీధర్ బాబు వెల్లడి




## ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ

ప్రతి ఒక్కరూ దీనిని హర్షించాల్సిందే
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి







## మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన



# నా బ్రాండ్ యంగ్ ఇండియా

ఒక్కొక్కరిదీ ఒక్కో బ్రాండ్
యంగ్ ఇండియా నా బ్రాండ్
సైనిక స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్ విద్యారంగాన్ని పటిష్టం చేయడమే లక్ష్యం
యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శకుస్థాపనలో రేవంత్

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో చదివామని విద్యార్థులు గర్వంగా చెప్పేలా విద్యాసంస్థను తీర్చిదిద్దాలి. ఆర్మీ, సైనిక్ స్కూల్, జాతీయ డిఫెన్స్ అకాడమీ నుంచి వచ్చామని గర్వంగా చెబుతుంటారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో చదివామని విద్యార్థులు గర్వంగా చెప్పేలా విద్యాసంస్థను తీర్చిదిద్దాలి. ఆర్మీ, సైనిక్ స్కూల్, జాతీయ డిఫెన్స్ అకాడమీ నుంచి వచ్చామని గర్వంగా చెబుతుంటారు. ఆ స్కూళ్లతో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ పోటీ పడలేదా? వాళ్లకు ఇచ్చే మౌలిక వసతులు ఇక్కడ కల్పించలేమా? రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఇదొక లెక్కా?

-సీఎం రేవంత్‌రెడ్డి







## తెలంగాణలో ఎవరు అడ్డుకున్నా బిజెపిదే అధికారం

రేవంత్ రెడ్డి సహకారంతోనే అధికారం చేపడతాం
బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ సంచలన కామెంట్స్

## చెట్లను నరికివేస్తే చర్యలేవీ




జింకలు చనిపోయినా పట్టించుకోరా
కంచెగచ్చిబౌలి భూములపై నివేదిక ఇచ్చాం
మీడియా సమావేశంలో హరీష్ రావు వెల్లడి

**హైదరాబాద్:,మనసాక్షి:** చెట్ల నరికివేత విషయంలో పేద రైతుకు ఒక న్యాయం, రేవంత్ రెడ్డికి ఒక న్యాయం ఉంటదా.. అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ కమిటీకి కంచ గచ్చిబౌలి భూములపై ఫిర్యాదును ఇచ్చిన అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలు ఉల్లంఘించి పండుగ రోజుల్లో, సెలవు దినాల్లో అడవుల విధ్వంసానికి వన్యప్రాణుల విధ్వంసానికి పాల్పడిన తీరును సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ కమిటీకి వివరించామని అన్నారు. ఈ రాష్ట్రంలో అడవుల విధ్వంసం, వన్య ప్రాణుల పట్ల ఎంత దారుణంగా వ్యవహరిస్తుందో పూర్తిగా ఆధారాలతో సహా కమిటీకి అందజేశాం. కమిటీ కొన్ని ప్రశ్నలు వేస్తే వాటికి కూడా వివరంగా సమాధానం ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. ఒక పేద రైతు తన పొలంలో ఉన్న చింత చెట్టునో, వేప చెట్టును నరికేస్తే ఎమ్మార్వో, ఎస్ఐ వచ్చి కేసులు పెడుతుంటారు. లక్షల రూపాయాల పెనాల్టీ విధిస్తుంటారు. కంచ గచ్చిబౌలిలో వందలాది ఎకరాల్లో వేలాది చెట్లు- నరుకుతుంటే రెవెన్యూ, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. పేద రైతుకు

ఒక న్యాయం.. రేవంత్ రెడ్డికి ఒక న్యాయం ఉంటదా..అని హరీశ్‌రావు

పేర్కొన్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు- నగరంలో ఎక్కడైనా ఇల్లు కట్టాలంటే.. వాల్టా చట్ట ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ. 50, పట్టణ ప్రాంతాల్లో

మిగతా 2లో

## కంచగచ్చిబౌలి భూములను పరిశీలించిన కేంద్ర కమిటీ

ప్రభుత్వ అధికారలతో సాధికారిక కమిటీ భేటీ
నివేదిక సమర్పించిన ప్రభుత్వం


**హైదరాబాద్:,మనసాక్షి:** నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీతో తెలంగాణ ప్రభుత్వ అధికారులు భేటీ అయ్యారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు కేంద్ర సాధికారిక కమిటీ హైదరాబాద్‌కు వచ్చింది. క్షేత్రస్థాయిలో

పరిశీలన చేసింది. గచ్చిబౌలి భూముల వ్యవహారంలో గురువారం కమిటీ వరుస సమావేశాలు నిర్వహించింది. ఉదయం భూములను సందర్శించిన కమిటీ క్షేత్రస్థాయిలో పరిస్థితులపై వివరాలను

మిగతా 2లో



## ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి



రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున వీలైనంత త్వరలో చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు.

**హైదరాబాద్,మనసాక్షి::** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున వీలైనంత త్వరలో చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన శ్రీపాల్‌రెడ్డి గురువారం ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, సంఘం నేతలు మహ్మద్ అబ్దుల్ గఫార్, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి భట్టిని కలిసిన వారిలో ఉన్నారు.



# ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం దేశవ్యాప్తంగా మరెక్కడా లేని విధంగా విస్తృతంగా కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని పూర్తి పర్యవేక్షణతో నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచే గొప్ప కార్యక్రమం అన్నారు. మూడు కోట్ల మందికి ప్రతి నెలా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణే. దేశంలో ఎక్కడా ఇటు-వంటి పథకం అమలులో లేదని మంత్రి తెలిపారు. గతంలో సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం పేదలకు చేరకపోవడం వల్లనే ప్రభుత్వం సన్న బియ్యాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. అది మధ్యలోనే దారి మళ్లి, అసలు లబ్దిదారులకు చేరకుండా తేడా వచ్చింది. అందుకే ఈసారి సన్న బియ్యాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఈ పథకం విజయవంతం కావాలంటే, ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో పథకం అమలును దగ్గర నుండి పర్యవేక్షించాల్సిందే అని మంత్రి స్పష్టం చేశారు. సన్న బియ్యం పేదలకు న్యాయంగా అందేలా చూసే బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిదని అన్నారు. ప్రతి ప్రజాప్రతినిధి, ఒక్కసారి అయినా సన్న బియ్యం తీసుకునే లబ్దిదారుల ఇంటిలో భోజనం చేయాలి. అప్పుడే వారు తినే అన్నం నాణ్యత ఎలా ఉందో తెలిసి వస్తుంది. ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం రేషన్ సరఫరాగా కాకుండా, ఆహార భద్రతకు సంకేతంగా తీసుకుంటోంది. అన్ని శాఖల సమన్వయంతో సన్న బియ్యం సరఫరాలో అక్రమాలు, లోపాలు లేకుండా చూడటం, అధికారుల కర్తవ్యం అని మంత్రి తెలిపారు. అంతేకాకుండా.. 'సన్నబియ్యం విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా తిప్పికొట్టాలి. గతంలో సంవత్సరానికి 24 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం లబ్దిదారులకు పంపిణీ చేశాం. ఇప్పుడు 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 49 వేల కార్డులే ఎక్కువ ఇచ్చారు. ఇప్పుడు 30 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కలెక్టర్లు పరిశీలిస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ కేసుల్లో షకీల్ అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. కొంతకాలంగా ఆయన దుబాయ్‌లోనే ఉంటున్నారు. అయితే షకీల్ తల్లి అనారోగ్యంతో కన్నుమూశారు. అంత్యక్రియల కోసం షకీల్ హైదరాబాద్‌కు వచ్చారు. మాజీ ఎమ్మెల్యే వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ విమానాశ్రయంలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పోలీసులకు కోరారు. దీనికి పోలీసులు అంగీకరించారు. షకీల్ తల్లి అంత్యక్రియలు ముగిసిన వెంటనే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఇప్పటికే పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేయనున్నారు. ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులను మేనేజ్ చేసి తన కుమారుడిని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశారంటూ షకీల్‌పై గతంలోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో అతనిపై కూడా కేసు నమోదు అయ్యింది. కేసు నమోదు విషయం తెలిసిన షకీల్ ఇండియాకు రాకుండా దుబాయ్‌లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఇండియాకు వచ్చాక ఎయిర్‌పోర్టు అధికారులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని షకీల్‌ను అరెస్ట్ చేశారు. అయితే తల్లి అంత్యక్రియల కోసం మాజీ ఎమ్మెల్యేకు అనుమతించారు పోలీసులు. సాయంత్రం షకీల్‌ను అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

# కంచగచ్చిబౌలి భూములను పరిశీలించిన కేంద్ర కమిటీ



తెలుసుకుంది. అనంతరం ఎంసీహెచ్‌ఆర్‌డీలో విద్యార్థి సంఘాల నేతలతో భేటీ అయి.. వివరాలు సేకరించింది. అనంతరం అధికారులతో భేటీ అయింది. దాదాపు 3 గంటలపాటు ప్రభుత్వ అధికారులతో కమిటీ భేటీ అయింది. సీఎస్ శాంతకుమారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, టీ-జీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, డీజీపీ జితేందర్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. 400 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులు, ప్రభుత్వ విధివిధానాలు, ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కమిటీ-కి నివేదిక సమర్పించారు. తాజ్ కృష్ణలో భారాస నేతలతో భేటీ అయింది. మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం ఈ వ్యవహారంపై కమిటీకి నివేదిక ఇచ్చింది. హెచ్‌సీయూ పాలకవర్గం, భాజపా ఎంపీలతోనూ భేటీ అయిన కమిటీ-.. భూముల అంశంపై సమగ్ర వివరాలు తీసుకుంది.

టీ-జీఐఐసీ ఈ భూములను చదును చేపట్టిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందజేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సెంట్రల్ ఎంపవర్ కమిటీ- ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు వచ్చారు. వీరు కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి సుప్రీంకోర్టుకు నివేదిక అందించనున్నారు.

## తెలంగాణలో ఎవరు అడ్డుకున్నా బిజెపిదే అధికారం

హైదరాబాద్: తెలంగాణలో ఎవరు అడ్డుకున్నా బిజెపిదే అధికారం అని, రేవంత్ రెడ్డి సహకారంతోనే అధికారం చేపడతామని బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారం రావడం అనేది తమ పార్టీ నేతల చేతుల్లోనే ఉందని, నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. దీనికి రేవంత్ రెడ్డి సహకారం కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన ఎంపీ అరవింద్.. రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కంటే అత్యంత ప్రమాదకారి అని.. హైదరాబాద్‌ను బేస్‌మెంట్‌త సహా కూల్చివేయడం ఖాయం అని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాలను చూస్తే తన చిన్నప్పుడు స్కూల్‌లో చదువుకున్న పాఠం గుర్తుకు వస్తోందన్నారు. రేవంత్ రెడ్డి పద్ధతి, పనితీరు ఇన్‌స్టిట్యూషన్స్ ఆర్ నాట్ కర్ప్ట్ ఇండివిజువల్స్ కరప్ట్ అన్న విధంగా ఉందంటూ విమర్శలు గుప్పించారు. ఈ సూత్రం సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ బీజేపీకి సరిగ్గా వర్తిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవడం నీ వల్ల కాదు కదా.. నీ బాస్ రాహుల్ గాంధీ వల్ల కూడా కాదంటూ సీఎ రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనివ్వము అన్నంత ఈజీగా కాదన్నారు. తన రెండు అడుగులు చాలు.. తెలంగాణలో బీజేపీ ఉందని చెప్పడానికి అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాడమనే అంశం తమ పార్టీ నేతల చేతిలోనే ఉందన్న ఎంపీ.. ఇందుకు రేవంత్ రెడ్డి సహకారం కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌కు ఉన్న దమ్ము ధైర్యం నీకు లేదా అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఎంపీ ప్రశ్నించారు. నిన్ను జైల్లో వేసిన వారిని ఎందుకు జైలుకు పంపలేకపోతున్నావ్ అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రికి రోషం, పౌరుషం లేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనా ఎంపీ అరవింద్ విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఓ బచ్చా అని.. అతను ఏం మాట్లాడుతాడో అతనికే తెలియదని వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ భూములన కబ్జా చేసిన బీజేపీ ఎంపీ ఎవరో దమ్ముంటే బయటపెట్టాలని కేటీఆర్‌కు ఎంపీ ధర్మపురి అరవింద్ సవాల్ విసిరారు.

## తెలంగాణ పల్లెలకు చేరువగా ఇంటర్నెట్

హైదరాబాద్: ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఐటిశాఖ మంత్రిశ్రీధార్ బాబు అన్నారు. చివరి గ్రామం, చివరి ఇంటి వరకు ఫైబర్ కనెక్టివిటీ చేర్చే పనిలో ఉన్నామని చెప్పారు. పేద, మధ్యతరగతి, పెద్ద తరగతి ప్రజలందరికీ సమానంగా సేవలు అందించాలన్నదే మా ధ్యేయం అని అన్నారు. ఫింగర్‌టిప్‌లో సమాచారం ఉండేలా సాంకేతిక వనరులు అందిస్తున్నాం. ఇవన్నీ అతి తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం వచ్చే ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని అన్నారు. ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా నడుస్తోంది. అక్కడ ప్రజలు ఎంతో హర్షిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటిలో స్మార్ట్ టీవీ ద్వారా టెలిఫోన్, కంప్యూటర్ సదుపాయాలు లభించేలా తయారు చేస్తున్నారని, ఇది విద్య, సమాచారం పరంగా ప్రజలకు చాలా ఉపయోగకరంగా మారనుందని వివరించారు. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 43,000 కిలోమీటర్ల ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటు- చేస్తున్నాం. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్‌గా నిలవనుందని మంత్రి చెప్పారు. అంతేకాకుండా.. '2013లో ÷ఖఆ ప్రభుత్వం ఇ÷ూకర ద్వారా గ్రామాల్లో ఫైబర్ నెట్‌వర్క్ ఇవ్వాలని ప్రారంభించింది. రాష్ట్ర విభజన తరువాత గత ప్రభుత్వం దీన్ని కొనసాగించింది. ఇప్పుడు మేము దీనిని పూర్తిగా పూర్తి చేయబోతున్నాం. మా ప్రభుత్వానికి సంవత్సరం నాలుగు నెలలు పూర్తవుతున్న ఈ సమయంలో, మిగిలిన 40 శాతం పనులు పూర్తి చేశాం. మిగిలినవన్నీ సమయానుకూలంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## మరో మూడ్రోజుల పాటు ఉరుములతో వర్షం

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. సాయంత్రానికి వర్షం మొదలైంది రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో గురువారం మధ్యాహ్నం నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. ఉక్కపోత నుంచి నగర ప్రజలకు ఉపశమనం కలిగింది. వారం రోజుల క్రితం వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అయ్యాయి. మళ్లీ ఇవాళ కాస్త ఎండలు నెమ్మదించాయి. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఎస్‌ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది

# నా బ్రాండ్ యంగ్ ఇండియా




హైదరాబాద్: ఒక్కొక్కరికి ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంటుందని...తన బ్రాండ్ యంగ్ ఇండియా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఇది ప్రతీ పోలీస్ సిబ్బందికి అత్యంత ముఖ్యమైనదని, ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆనాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీలకు పునాదులు పడ్డాయని, నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందన్నారు. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండి పోయారని అన్నారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని, ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారని, హైదరాబాద్‌లో ఐటీని

అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్‌ను గుర్తుంచు కుంటారని, అలాగే ఇవాళ తాను క్రియేట్ చేసిన తన బ్రాండ్ 'యంగ్ ఇండియా' మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామని అన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్ అని, నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ-ని ఏర్పాటు- చేసుకున్నామన్నారు. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్‌గా నియమించుకున్నామని, ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉందని, దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమిని ఏర్పాటు- చేసుకోబోతున్నామని చెప్పారు. ప్రతీ నియోజక వర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందని అన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి... ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సైనిక్ స్కూల్‌కు ధీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చి దిద్దాలని.. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. పోలీస్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని.. సామాజిక బాధ్యతగా ప్రైవేటు- కంపెనీలు పోలీస్ స్కూల్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలని.. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు తీసుకున్న నిర్ణయాలే చరిత్రలో నిలిచి పోతాయి.. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా.. పీవీ సంస్కరణలు గుర్తించాల్సిందే.. అధికారులకు విజ్ఞప్తి.. మేము విధివిధానాలు సృష్టిస్తాం.. దాన్ని అమలు చేయాల్సింది మీరు.. నా బ్రాండ్ యంగ్ ఇండియా..అన్నారు. యంగ్ ఇండియా యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం.. ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది.. నా బ్రాండ్ యంగ్ ఇండియా అని తెలిపారు. సౌత్ కొరియా ఒక చిన్న స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ ఖ్యాతిని పెంచింది.. ఇంత పెద్ద దేశంలో ఒలంపిక్స్ లో చిన్న మెడల్ కూడా రాలేదు.. ఇంజనీరింగ్ పట్టా తీసుకుని పోతే.. తల్లిదండ్రులకు సంతోషం.. ఉద్యోగాల కోసం కంపెనీలకు పోతే.. అప్లికేషన్ కూడా నింపలేని పరిస్థితి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీనీ బెస్ట్ యూనివర్సిటీగా రూపొందిస్తాం.. రాజకీయ ఆలోచనలు చేయలేదు స్కిల్ యూనివర్సిటీలో.. సక్సెస్ ఉన్న కంపెనీలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీలో చేరిన వాళ్ళకి 100 శాతంఉద్యోగాలు వచ్చాయి.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ-లో కూడా పెద్ద కంపెనీలు పోటీ-పడుతున్నాయి.. పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ అత్యంత ముఖ్యమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 16నెలలైనా బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని నన్ను కొందరు అడుగుతున్నారు. యంగ్ ఇండియాలో చదువు, ఉపాధే నా బ్రాండ్. కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారు. దేశానికే దార్శనికుడు పీవీ నరసింహారావు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని స్థాపించాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. కేజీ టు- పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావు. యంగ్‌ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను సమకూర్చుకోవాలి. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా

చూసుకోవాలని రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో కనీస వసతులు లేవు.. ప్రతి నియోజక వర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం.. 25 ఎకరాల్లో స్కూల్.. ప్రతీ స్కూల్ కి 200 కోట్లు-.. విద్యా విధానంలో చిన్న గ్యాప్ ఉంది.. ప్రైవేటు- స్కూల్ లో విద్యార్థులు ఎక్కువ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యావంతులు.. కానీ ఇక్కడ చదివే పిల్లలు 18 లక్షల మందే చదువుతున్నారు.. నర్సరీ.. కూడా ప్రభుత్వ స్కూలులో ఏర్పాటు చేయాలని.. ప్లే స్కూల్ పెట్టాలని మా ఆలోచన.. త్వరలోనే అమలులోకి తెస్తాం.. సైనిక్ స్కూల్ తో మనం పోటీ- పడాలని అన్నారు.నేను ఉన్నంత కాలం మీకు నిధులు.. అనుమతులకు లోటు ఉండదని అన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, కమిషనర్ సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## చెట్లను నరికివేస్తే చర్యలేవీ

అయితే రూ. 100 చలాన్ కట్టి.. ఇల్లు కట్టాలని చెట్లు నరికేస్తున్నానని దరఖాస్తు చేయాలి. ఆ దరఖాస్తు పరిశీలించిన తర్వాత కమిటీ ఒక్కొక్క చెట్టుకు రూ. 450 డిపాజిట్ చేయమని చెబుతుంది. ఒక చెట్టు కొడితే రెండు చెట్లు- పెంచాలని సూచిస్తుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తు పెట్టలేదు.. అటవీశాఖ అనుమతి తీసుకోలేదు. అటవీ భూముల్లోనే కాదు.. సొంత పట్టా భూమి, ఇంటి నిర్మాణంలోనూ చెట్లు కొడితే అనుమతి తీసుకోవాల్సిందేనని చట్టం చెబుతుంది. లక్షల రూపాయాలు పెనాల్టీ వేస్తుంటారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వేలాది చెట్లను నరికేస్తుంది. పోలీసుల రక్షణలో 50 బుల్డోజర్లు పెట్టి చెట్లను ఊచకోత కోశారు అని హరీశ్‌రావు తెలిపారు.ఒక్క జింకను చంపిన సల్మాన్‌ఖాన్‌ను జైల్లో వేశారు.. మరి మూడు జింకలను చంపిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలేవి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలిలో మూడు జింకలు చనిపోయాయని ఆధారాలతో సహా బయటకు వచ్చాయి. గూడును చెదరగొట్టడంతో దిక్కులేక కుక్కల దాడిలో జింకలు చనిపోయాయి. సల్మాన్‌ను ఒక జింకను చంపితే జైల్లో వేశారు. మరి మూడు జింకల మరణానికి కారణమైన రేవంత్ రెడ్డిపై న్యాయపరమైన చర్య తీసుకోవాలి కదా.. అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే
### కబ్జాలు....కక్షసాధింపులు



హైదరాబాద్, ఎస్‌ఆర్డీపీ పథకం కింద హైదరాబాద్‌లో చేపట్టిన పనులు 16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పూర్తయినవాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్ చేశారు కానీ నిర్మాణంలో ఉన్నవాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశాని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కమిషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా అని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల

మీద ఉన్న శ్రద్ధ నిర్మాణాల మీద లేదా అని నిలదీశారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. నాడు వాయువేగంతో ఎస్‌ఆర్డీపీ పథకం కింద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జీలు నిర్మించాం. కానీ 6 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్న పనులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఫలక్ నుమా ఆర్వోబీని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్ గూడా జైలుకు పంపే శ్రద్ధ దాని ముందున్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంపై లేదని మండిపడ్డారు. శిల్పా లేఅవుట్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి కలిపే రెండో లెవెల్ వంతెనది అదే దుస్థితి ఉంది. శాస్త్రిపురం ఆర్వోబీ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పూర్తయిన వాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగులు చేశారు. నిర్మాణంలో ఉన్న వాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశారు. కాంగ్రెస్ అంటే కమిషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా ? ?హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ నిర్మాణాల మీద లేదా! ?అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్ లను ఉసిగొల్పడం కాదు!' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## పోషణ పక్షం గోడపత్రిక ఆవిష్కరణ: జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10, మన సాక్షి :**




పోషకాహార ప్రాముఖ్యతపై ఈనెల 22 వరకు నిర్వహించనున్న పోషణా పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా పోషణా పక్షం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ పక్షం-2025 కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 8 నుండి 22 వరకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో అంగన్వాడి కేంద్రం, ప్రాజెక్ట్ ల పరిధిలో జిల్లా స్థాయిలో (4) రకాల ప్రతిపాదిత నేపథ్యాల(మొదటి 1000 రోజులపై దృష్టి, లబ్దిదారుల మాడ్యుల్ ను ప్రజాదరణ పెంపొందించడం, పిల్లలలో ఉభకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి) పైన వివిధ రకాలైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నహొ 3 ( నారాయణపేట, మక్తల్, మద్దూరు) ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న 704 అంగన్ వాడీ కేంద్రాలలో 6 సంవత్సరాల లోపు చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపంతో భాధపడుతున్న వారిని గుర్తించి అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం ఇతర సేవలను పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ జయ,సిడిపిఓలు వెంకటమ్మ,సరోజిని, వెంకటేశ్వరమ్మ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10, మన సాక్షి :**



ఈనెల12న శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేద్దామని విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్. రాంబాబు కోరారు. ఈ సందర్భంగా గురువారం విహెచ్ పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం విజయవంతం చేసిన మాదిరిగానే హనుమాన్ జయంతి శోభాయాత్రను ప్రతి ఇంటి నుంచి ప్రతి ఒక్కరు తప్పకుండా శోభాయాత్రకు హాజరుకావాలన్నారు. శోభాయాత్రను మన సాంప్రదాయ వాయిద్యాలతో, తాళమేళాలతో, చెక్కభజనలు, కోలాటాలు, దాండియా ఆటపాటలతో, మన సంస్కృతి ఉట్టిపడేలా జరుపుకోవాలని కోరారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించ తలపెట్టిన శోభాయాత్రలో హిందూ బంధువులందరూ సాంప్రదాయ వస్త్రాలతో కాషాయ కండువాతో కుటుంబ సమేతంగా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కన్న శివకుమార్, మురళి భట్టాడ్, కడుదాస్ ప్రవీణ్, నీరటి వెంకటేష్, వడ్ల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సిఐ కారు డ్రైవర్ జులుం

**కొల్చారం, ఏప్రిల్ 10,మన సాక్షి:**



మెదక్ ఎక్సైజ్ సీఐ కారు డ్రైవర్ వార్త కవరేజ్ కి వెళ్ళిన విలేకరులపై ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఎదుటే విలేకరుల ఫోన్ గుంచుకొని జులుం చేసిన ఘటన గురువారం కొల్చారం మండలం రంగంపేట లో జరిగింది. గురువారం రంగంపేట వైన్స్ లో తనిఖీకి మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది రంగంపేట వైన్స్ దుకాణానికి వచ్చారు. అధికారులు తనిఖీ చేస్తున్నారు ఫోటోలు తీయడానికి స్థానిక విలేకరులు వెళ్ళగా ఎక్సైజ్ సిఐ అద్దెకారు డ్రైవర్ విలేకరుల వద్ద ఫోన్ లాక్కున్నాడు. విషయం తెలిసిన స్థానిక విలేకరులందరూ వైన్స్ వద్దకు చేరుకొని ఎక్సైజ్ అధికారులను నిలదీయడంతో ఎక్సైజ్ అధికారులు అక్కడి నుండి వెళ్లిపోయారు. గతంలో కూడా గతంలో కూడా ఈ కారు డ్రైవర్ పై పలు ఆరోపణలు ఉన్నాయి. కారు డ్రైవర్ ను మధ్యవర్తిగా ఉంచుకొని గత కొన్ని సంవత్సరాలుగా మెదక్ ఎక్సైజ్ కార్యాలయ సిబ్బంది వైన్స్ దుకాణాల యజమానుల వద్ద నుండి, కల్లు దుకాణాల యజమానుల నుండి మామూలు వసూలు చేస్తున్నట్లు గతంలో అనేకమార్లు ఆరోపణలు వచ్చాయి. గురువారం ఎక్సైజ్ అధికారుల రంగంపేట వైన్స్ లో తనిఖీ చేస్తుండగా ప్రైవేటు వ్యక్తి అయిన డ్రైవర్ సైతం అధికారులతో కలిసి వైన్స్ గోదాంలోకి వెళ్లి తనిఖీ చేయడం గతంలోని ఆరోపణలకు బలం చేకూర్చింది. ఎక్సైజ్ అధికారుల దాడులకు సంబంధించి కళ్ళు దుకాణాల యజమానులకు, బెల్టు దుకాణాల నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇస్తూ దుకాణాల నిర్వహకులకు , ఎక్సైజ్ అధికారులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి

# కొండగట్టు ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు



**జగిత్యాల, ఏప్రిల్ 10,మన సాక్షి:**

జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఇవాళ ఏర్పాటయింది చైర్మన్ తో పాటు 11 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎండోమెంట్ కమిషనర్ కు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు కాగా ఉత్సవ కమిటీ సభ్యులు కొండగట్టు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదం అందించారు అనంతరం వీరు ఎమ్మెల్యేను కలిశారు వీరందర్నీ ఎమ్మెల్యే శాలువాతో సన్మానించడం జరిగింది

# భక్తుల కొంగు బంగారం జట్టి హనుమాన్

**నారాయణపేట టౌన్ ఏప్రిల్ 10 మన సాక్షి :**



నారాయణ పేట మండ లంలోని జాజాపూర్ గ్రామంలో లో వెలసిన జట్టి హనుమాన్ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లు తున్నాడు. స్వామివారి జాతరఉత్సవాలు ఈ నెల 12న శనివారం ఘనంగా నిర్వ హించేందుకు నిర్వాకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. చరిత్ర లోకి వెళితే నిజాం (రజాకార్ల) కాలంలో గ్రామం లోని పంచకట్టపై ప్రతిష్టించిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొలగించారని పూర్వీకులు చెబుతుంటారు. అదేచోట 1990లో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు ఆలయం నిర్మించి జట్టి హనుమాన్ ను ప్రతిష్టిం చి హనుమాన్ జన్మదినాన జాతర ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే అప్పటి నుంచి స్వామివారు భక్తుల కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారం గా ఇలవే ల్పుగావిరాజిల్లుతూ పూజలు అందుకుంటున్నారు. ప్రధానం గా జాతర ఉత్సవాల్లో స్వామి వారి ఆలయం ముందు నిర్వ హించే యజ్ఞహొమంలో సంతానం లేని భక్తులు కూర్చుంటే వచ్చే జారర నాటి కి స్వామివారుసంతానం ప్రాప్తిస్తున్నాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలా సంతానం కలిగిన భక్తులు జాతర ఉత్స వాల్లో స్వామివారి ముందు తమ శిశువు ను బంగారం (బెల్లం)తో కానీ లడ్డుతో కానీ, నాణేలతో మొక్కుబడిగా తులాభారం నిర్వహించి స్వామివారి కి సమర్పిస్తారు. ఈనెల 12న శనివారం స్వామివారి ఉత్సవాల సంద ర్భంగా స్వామివారికి పంచా మృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి యజ్ఞ హొమం నిర్వహించిన అనం తరం తులాభారం కార్యక్రమం నిర్వహిస్తారు. ఆతరువాత ప్రసాద వితరణ, పెద్ద ఎత్తున అన్నదానం చేస్తారు. ఉత్సవా ల్లో పాల్గొనేందుకు ఉమ్మడి రాష్ట్రం, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తులాభారం నిర్వ హిస్తారు. ఉత్సవాలు ఈసారి ఆలయ నిర్వాహకులు ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# అత్తాపూర్ లో గంజాయి కలకలం

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 10, మన సాక్షి :**



కేజీ గంజాయని అత్తాపూర్ పోలీసులు సీజ్ చేశారు. చిన్న చిన్న ప్యాకెట్స్ లో ప్యాకింగ్ చేసి హసన్ నగర్ ప్రాంతంలో విక్రయిస్తున్న షేక్ జాకీర్. స్థానికంగా విద్యార్థులు, యువతకు ను టార్గెట్ చేసి అమ్మకం. జాకిర్ ను రెడ్ హ్యాండెడ్ గా పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర లోని అమరావతి నుండి గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయం. ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్ర అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా పాదయాత్ర

**కొల్చారం, ఏప్రిల్ 10,మన సాక్షి**



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత కేంద్రమైనార్టీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో భాగంగా సంగాయిపేట మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి మహిళా అధ్యక్షురాలు గంగాభవాని, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, మాజీ సర్పంచులు బండి సుజాత, మన్నె శ్రీనివాస్, మన్నె రాములు, నెల్లి రాజు, నగరం లలిత బాయి, నగరం రమేష్, ఎల్లుగారి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ చందాపురం మధుసూదన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శేఖర్, మైనారిటీ సెల్ అక్రమ్, పైతర అనిల్, పైతర చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజ్ రంగంపేట సింగిల్ విండో డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గొండ కృష్ణ, బండి రమేష్, కొమ్ముల రవీందర్ గౌడ్, దర్జీ రాజు, పిఎసిఎస్ డైరెక్టర్ దుర్గేష్ గౌడ్, జనార్దన్ రెడ్డి, తుక్కాపూర్ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు వెంకట్ గౌడ్, రాజు కిష్టయ్య మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంప లక్ష్మయ్య, మన్నె కిష్టయ్య, ఆగం గౌడ్, మాజీ సర్పంచ్ బధ్యానాయక్, చిలుక ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10, మన సాక్షి:**



నారాయణపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవలు ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం బాలాజీ గోల్డ్%డ%సిల్వర్ ప్రయివేట్ లిమిటెడ్, కార్పొరెట్ సోషల్ రెస్పాన్స్ బులిటి, లయన్స్ లైఫ్ చారి ట్రబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ మాజీగవర్నర్ సరిత హరి నారాయణ్ బట్టడ్ నేతృత్వంలో పట్టణంలోని ఎర్ర గుట్ట వద్ద గల కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినీలకు రూ. 5లక్షల విలువ గల బెంకర్ బెడ్స్ ను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణిక రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పట్టణంలోని మహంకాళి వీధిలో గల హరినారాయణ బట్టడ్ నివాసంలో రూ 5 లక్షల తో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు సేవా దృక్పథంతో ఏర్పాటు చేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కస్తూర్బా విద్యార్థినులకు బేకర్ బెడ్స్ ఇచ్చిన లైన్స్ క్లబ్ సభ్యులను కలెక్టర్ అభినందించారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో 7లక్షల 50 వేలతో తెచ్చిన అధునాతన అంబులెన్సు వాహనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, ఎస్పి యోగేష్ గౌతమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి నల్లపు లింగయ్య, డిసిసి. మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి, బాలాజీ గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ బబితా సాకేత్ బట్టడ్, లయన్స్ క్లబ్ డిస్టిక్ ఫస్ట్ గవర్నర్ సురేష్ జగ్నానీ, ఎంవి చారి, రమేష్, చంద్రబాబు, శక్తి పీఠం వ్యవస్థపకులు డాక్టర్ శాంతానంద్ స్వామి లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు జి.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై నిఘా

**ధర్మారం, ఏప్రిల్, 10 :మన సాక్షి:**

ధర్మారం గ్రామంలోని గణేష్ నగర్ లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సార్ల లక్ష్మణ్,తూర్పాటి జాన్ పాల్,యాదండ్ల రాజేష్,సంకే భానుచందర్, లను పట్టుకుని వారి వద్ద నుండి 24,900/- రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయనైనది. ఇందులో ఒక వ్యక్తి దుదాని తుఫాన్ సింగ్ అను వ్యక్తి పారిపోయినాడు. ఇట్టి వారిని పట్టుకోవడంలో, ఏఎస్ఐ,అబ్దుల్ జలీల్, హెడ్ కానిస్టేబుల్ జి.భూమయ్య, కానిస్టేబుల్స్ మధుసూదన్ రెడ్డి, రజినీకాంత్, నరేందర్ లు తదితరులు ఉన్నారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు




**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10 మన సాక్షి :**

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు షీ టీం పోలీసులు గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని సింగారం కూడలి మక్తల్ రోడ్డులో ఉన్న శ్రీ దత్త బృందావన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ కళాశాలలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయి కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండాలని, చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయడం జరుగుతుందని, ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 8712670398 కి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్ కి బానిసలై తమ లక్ష్యాలను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు చేసుకోవద్దని సూచించారు. అలాంటి వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబరిచి తమ నైపుణ్యానాలను పెంపొందించుకొని ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ప్రతిరోజు ఆటలు ఆడాఆటలు ఆడడం వల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్య, జ్యోతి, కవిత, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 10, మన సాక్షి:**

ప్రజల దాహార్తిని తీర్చే చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్ లో సీనియర్ నాయకులు సురేష్ నాయక్ జ్ఞాపకార్థం సురేష్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నగేష్ నాయక్ వారి ఆద్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్నిగురువారం ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్ తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ముందుగా చల్లని మజ్జిగను కాలనీ వాసులకు, బాటసారులకు అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు,కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

# హనుమాన్ శోభ యాత్రను విజయవంతం చేయాలి

**సికింద్రాబాద్,ఏప్రిల్ 10, మన సాక్షి:**



ఏప్రిల్ 12న జరిగే హనుమాన్ శోభయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందు వాహిని నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం లాలాపేట శ్రీ పోచమ్మ దేవాలయం వద్ద హనుమాన్ శోభయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లును హిందూ క్షేత్రాల సభ్యులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూ వాహిని ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర హిందు వాహిని ఆర్గనైజింగ్ సెక్రెటరీ యాదిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఏప్రిల్ 12 ఉదయం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, సాయంత్రం 6 గంటలకు ఓల్డ్ లాలాపేట దర్వాజా మైసమ్మ ఆలయం వద్ద శోభయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శోభ యాత్రకు హిందూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని నాయకులు సాయి,అనిల్ జైశ్రీరామ్, ప్రదీప్, విశాల్, మహేష్, విమల్,గోపాల్ చారి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్ర శాంతియుతంగా జరుపుకోవాలి

## జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10, మన సాక్షి :



నారాయణపేట జిల్లాలో ఈనెల 12న శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే శోభాయాత్ర జిల్లా పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులను, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ హిందూ మత పెద్దలతో ఎస్పీ యోగేష్ గౌతమ్ గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి వారి సలహాలు సూచనలు ఎస్పీ స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో హనుమాన్ జయంతి శోభాయాత్రలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని అందుకు పోలీసు శాఖ నుండి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

శోభాయాత్ర సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కచ్చితంగా వాలంటీర్స్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చుసుకోవాలని కోరారు. జిల్లా పరిధిలో ఎక్కడ శోభ యాత్ర నిర్వహించిన పోలీసుల అనుమతితో నిర్వహించుకోవాలని అందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దలు, చిన్న పిల్లల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని పెద్ద సౌండ్ వచ్చే డీజే లకు అనుమతి లేదన్నారు. లౌడ్ స్పీకర్లను, బ్యాండ్, డోలు లను ఉపయోగించుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే సోషల్ మీడియాలో ఒక మతాన్ని కించపరుస్తూ పోస్టులు చేయరాదని ఎవరికి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే తప్పనిసరిగా సంబంధిత లోకల్ పోలీసులకు, డయల్100కి సమాచారం ఇవ్వాలన్నారు. శోభయాత్రలో ఎలాంటి అలజడి సృష్టించాలని చూసిన అట్టి వ్యక్తులు ఎలాంటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందుకు బాధ్యులుగా ఉత్సవ కమిటీ సభ్యులు ఉంటారని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యుల సూచనల మేరకు కలెక్టర్ పర్మిషన్ తో హనుమాన్ జయంతి రోజు వైన్ షాపులు బంద్ చేయడానికి చూస్తామని తెలిపారు. ప్రజలంతా కులమతాలకతీతంగా తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని అందుకు పోలీస్ వారి పూర్తి సహకారం ఉంటుందని మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ లు రాజేందర్ రెడ్డి, సైదులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్. రాంబాబు, నందు నామాజీ, ప్రవీణ్, కన్న శివ కుమార్, మురలీ బట్టడ్, పోషల్ వినోద్, వివిధ మండలాల నుండి విశ్వవిందు పరిషత్, బజరంగ్ దళ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి కూడలిని సుందర శోభితవనంగా తీర్చిదిద్దుతున్నాం: ఎమ్మెల్యే గాంధీ



శేరిలింగంపల్లి,ఏప్రిల్ 10,మన సాక్షి:

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గచ్చిబౌలి జంక్షన్,నల్లగండ్ల తెల్లాపూర్ చౌరస్తాల వద్ద చేపట్టిన సుందరికరించి, విద్యుత్తు వెలుగులతో అభివృద్ధి చేసిన కూడళ్లను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లతో కలిసి పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కూడలి ని సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి చేసిన జంక్షన్ ను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరంగా ఉందనీ అన్నారు. అన్ని హంగులతో ,సకల సౌకర్యాలతో కూడలి ని అభివృద్ధి చేయడం జరిగింది, ప్రజలు, వాహనదారులను, చూపరులను ఆకట్టుకునేలా అద్భుతంగా కూడలిలను తీర్చిద్దిద్దడం జరిగిందన్నారు. పిల్లలు, వృధ్ధులు ,ప్రజలు కాసేపు సేద తిరడానికి అనువుగా ,కూర్చోడానికి వీలుగా బల్లలు ఏర్పాటు చేసి, నియోజకవర్గంలో ప్రతి కూడలి ని సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రతి కూడలిని ఒక పరిపూర్ణ రూపంలో అందుబాటులోకి తెస్తున్నాం. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక నేతలు ,నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల కోసం నీటి కుండీలు ఏర్పాటు



భీంగల్,ఏప్రిల్ 10,మన సాక్షి:

భీంగల్ పట్టణంలో వేసవికాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పశువుల దాహం తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీడీఎంఏ పరిధిలో కమిషనర్ గంగాధర్ నేతృత్వంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి కుండీలు ఏర్పాటు చేశారు. వేసవిలో పశువులు దాహంతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నామన్నారు. కుండీల్లో ప్రతిరోజు నీటిని క్రమం తప్పకుండా భర్తీ చేస్తామన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

మల్లాపూర్,ఏప్రిల్ 10,మన సాక్షి:



మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంనుండి ఓబ్లపూర్ నందు జై బాపు జై భీమ్ జై సమ్మిధన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ గాంధీజీ అంబేద్కర్ ఆలోచన భారత రాజ్యాంగ నిర్మాణం బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో మేలు జరిగినది రాజ్యాంగాన్ని ఇయాల భారతీయ జనతా పార్టీ పక్కదోవ పట్టిస్తుంది జై బాపు జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమా ద్వారా నిజాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశంలో కానీ రాష్ట్రంలో కానీ సంక్షేమ పథకాల అమలు ముందు వరుసలో ఉంది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పేదలకు ఉచిత సన్న బియ్యం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రతి గృహం నాకు 200 లోపల ఉచిత కరెంటు రైతులకు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా యువకులకు యువ వికాసం మరి ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు అందేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది కావున ఇప్పటికైనా నమ్మండి బిజెపి తప్పుడు మాటలను మీరు నమ్మకండి ప్రజల కాపాడింది కాంగ్రెస్ రాష్ట్రాన్ని కాపాడేది కాంగ్రెస్ దేశాన్ని కాపాడబోయేది కూడా కాంగ్రెస్ ఈ కార్యక్రమంలో జిల్లాకి సెల్ సెల్ అధ్యక్షులు ఎలాల జలపతి రెడ్డి గారు గ్రామ శాఖ అధ్యక్షులు గోల్కొండ రమేష్ మండల అధ్యక్షులుపుంద్ర శ్రీనివాస్ రెడ్డి నల్ల బాపురెడ్డి నాయిని సురేష్ నల్ల రాజన్న ఎలేటి జలపతి రెడ్డి కోటగిరి ఆనంద్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భీంగల్,ఏప్రిల్ 10,మన సాక్షి:



మోర్తాడ్ మండలం డోన్కల్ గ్రామంలో ఎస్.ఎస్.సి బ్యాచ్ (1999-2000) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్.ఎస్.సి బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యులతో సహా ఆత్మీయంగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తదనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా బోధించిన విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా శాలువ పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ. 25 సంవత్సరాలు తర్వాత కూడా మమ్మల్ని మర్చిపోకుండా గుర్తుంచు కోవడం సంతోషకరం అని అన్నారు. గురు శిష్య బంధం కుటుంబ బంధం కన్నా మహెరీన్నతమెనదని అన్నారు. విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, సామాజిక సేవ, సకల రంగాలలో సేవ చేస్తూనే ప్రభుత్వోద్యోగులుగా రాణించి, కష్టాల్లో ఆపద్బాం ధవులుగా నిలవాలని కాంక్షించారు. విద్యా బోధనలు చేసిన గురువులకు పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులందరూ ఒకచోట కలిసి బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడపడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థిని, విద్యార్థులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎంపీకి ఆహ్వానం

నాచారం,ఏప్రిల్ 10,మన సాక్షి:



ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు నాచారం అంబేద్కర్ విగ్రహ కమిటీ తెలిపింది. ఉత్సవ కార్యక్రమనికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కలిసి అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొనాలని ఆహ్వాన పత్రిక ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉప్పల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ఏర్పుల నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాచారం డివిజన్ అధ్యక్షుడు శ్రీమూర్తి నాగరాజు, నాచారం అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఐఎన్టిఎస్ఓ లెవెల్-2లో తార్నాక శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

నాచారం, ఏప్రిల్ 10,మన సాక్షి:



ఇటీవల జరిగిన ఐఎన్ టిఎస్ ఓ లెవెల్-2 పరీక్షలో తార్నాక శ్రీ చైతన్య విద్యార్థులు ఘన విజయం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తెలిపారు. ఫలితాలలో మొదటి బహుమతి ఇద్దరు, రెండవ బహుమతి ఒక్కరు, మూడవ బహుమతి ఒక్కరు, నాలుగవ బహుమతి ఇద్దరు, ఐదవ బహుమతి మూడు తో సహా 62 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, 8 మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులు, 128 మంది గోల్డ్ మెడల్స్, 207 మంది సర్టిఫికెట్స్ సాధించి తమ విద్యార్థులు ఎంత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్స్ ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొని ఐ ఎన్ టి ఎస్ ఓ విజేతలను అభినందించి సత్కరించారు. అనంతరం అలీ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ రాజేంద్రప్రసాద్, పుల్లారావు, డీన్ సృజన్, ఒలింపియాడ్ ఇంచార్జ్ జ్యోష్ణ, సి బ్యాచ్ ఇంచార్జ్ కనకరాజు, ప్రైమరీ ఇంచార్జ్ రేచల్ తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకల కరపత్రం ఆవిష్కరణ

నాచారం,ఏప్రిల్ 10,మన సాక్షి:



ఏప్రిల్ 14న ఓయూ లో నిర్వహించే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్134వ జయంతి విజయవంతం చేయాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీఎస్ఎఫ్ సలహాదారుడు పాలిటీ ఫేమ్ డాక్టర్ ముసవీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా జరిగే అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో మేధావులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిల్నునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీఎస్ఎఫ్ సెక్రటరీ రమేష్ నాయుడు, ట్రెజరీ కుమ్మరి అనిల్ కుమార్, లీగల్ ఫోరం కరణ్, కోట ప్రభాకర్, శశి కుమార్, ప్రశాంత్, రాజేందర్ నాయక్, ఎమ్మెస్ ఎఫ్ అజయ్ సామ్రాట్, క్రాంతి కుమార్ వివిధ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

భీంగల్,ఏప్రిల్ 10,మన సాక్షి:



భీంగల్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కుప్కల్ గ్రామ శివారులో పట్టుకున్నామ న్నారు. ఇసుకకు సంబంధించి వారి దగ్గర ఎలాంటి పత్రాలు లేవన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేశామన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# సన్న బియ్యం పంపిణీ నిర్ణయాలు చరిత్రాత్మకం

నడిగూడెం,ఏప్రిల్ 10,మన సాక్షి:



భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని విహెచ్ పిఎస్ రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వారి ప్రయత్నాలను తిప్పి తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామ గ్రామాన రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై పాదయాత్రలు చేస్తూ విస్తృత ప్రచారం చేయాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఏఎంసీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుదీర్ లను మండల పార్టీ అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి పార్టీ నాయకులతో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, నడిగూడెం పిఏసిఎస్ చైర్మన్ కొల్లు రామారావు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు శ్రీనివాస్,దేవపత్తిని రమేష్ ప్రసాద్, బడేటి వెంకటేశ్వర్లు, రామిని విజయవర్ధన్ రెడ్డి, దున్నా శ్రీనివాస్, గడ్డం మల్లేష్ యాదవ్, గుజ్జ ఆంజనేయులు, పల్లా వెంకటరెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండు మహేందర్ గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, నలమాద వీరబాబు, భారీ వెంకన్న, నూకపంగు వెంకటేశ్వర్లు,దున్నా రాజు,లంజపల్లి సైదులు, పల్లపు గోపాల్, శ్రీరాముల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉప తహసిల్దార్ జుబేర్ కు ఆత్మీయ వీడ్కోలు

కంగ్టి, ఏప్రిల్ 10, మన సాక్షి :



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఉప తహసిల్దార్ జుబేర్ గా పనిచేస్తూ బదిలీ కావడంతో గురువారం ఆయనకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై మొగుడంపల్లి మండలానికి వెళ్తున్న సందర్భంగా తహసిల్దార్ సి. భాస్కర్ ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉప తహసిల్దార్ జుబేర్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్తయ్య, ఎంఈవో రహీమొద్దీన్,ఉప తహసిల్దార్ అబ్దుల్ ముగ్ని, ఆర్ఐ లు మల్లేశ్వర్ రెడ్డి, తాజోద్దీన్, ఎంపిఓ సుభాష్ , సిబ్బంది రహుఫ్, వినోద్ సంజు, గుండు మోహన్, తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే రామచంద్రునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

చిన్నగూడూరు,ఏప్రిల్ 10,మన సాక్షి:

గిరిజన ఎమ్మెల్యే, విద్యావంతుడు, వైద్యుడు, ప్రజా నాయకుడు, డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత డాక్టర్ రామచంద్రనాయక్ కు మంత్రి పదవి ఇవ్వాలని రావుల ప్రమోద్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డోర్నకల్ నియోజకవర్గంలో గిరిజనులు ఎక్కువ ఉండి పేద కుటుంబంలో జీవిస్తున్నారని వెనుకబడిన ప్రాంతంగా ఉందని అన్నారు. ఈ డోర్నకల్ నియోజకవర్గం నుండి గిరిజనుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ కి గిరిజనులు అధిక ఓట్లు వేసి 53 వేల మెజార్టీ పై చిలుకుగా గెలిపించుకున్నారని అన్నారు. ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ కు కచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అన్నారు. అప్పుడే ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తన వైద్య వృత్తితో గత రెండు దశాబ్దాలుగా వైద్య వృత్తిలో అనేకమంది పేద, బడుగు బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించడం జరిగింది. మరియు గిరిజన తండా గూడాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేద గిరిజన బిడ్డలకు అనేక సేవలందించడం జరిగిందన్నారు.

# యూనివర్సిటీ హాస్టల్ సమస్యలపై ఏబీవీపీ వినతి

నల్లగొండ,ఏప్రిల్ 10,మన సాక్షి:



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు హనుమాన్ మోహన్.హాస్టల్ డైరెక్టర్ కు హాస్టల్ సమస్యలను నిరసిస్తూ వినతి పత్రం అందజేయడం జరిగింది. యూనివర్సిటీలోని హాస్టల్స్ లో త్రాగునీరు,క్లీనింగ్,నూతన మెస్ బిల్డింగ్ మరికొన్ని సమస్యలతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారని కావున హాస్టల్ లో విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారువారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు విజయ్,వెంకట్, ప్రత్యూష,శ్రీ నందిని,తరుణ్, సాయి, వెంకట్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్, డీజల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



**చిట్యాల,ఏప్రిల్ 10,మన సాక్షి:**

పెంచిన గ్యాస్, డీజల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
గురువారం తాళ్ల వెల్లంల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు, పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ సుంకం 2 రూపాయలను పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పేదలపై అధిక ధరల భారాన్ని మోపి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా మోడీ సర్కార్ పనిచేస్తుందని విమర్శించారు. ఈ ధరల పెరుగుదల వల్ల రాష్ట్రంలోని 91 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు కత్తుల లింగస్వామి, చిట్యాల మండల సహాయ కార్యదర్శి నకిరేకంటి రాములు, సంఘం నాయకులు ఎల్లయ్య, పద్మ, అంజమ్మ, శారద, సంతోష, నాగలక్ష్మి, కవిత, లిఖిత, రమణ, అరుణ, పూలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి కూలీల గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా బత్తుల పద్మ, ఉపాధ్యక్షులుగా జనగాం శారద, కార్యదర్శిగా పగడోజు నాగలక్ష్మి, సహాయ కార్యదర్శిగా గోపగోని కవిత 11 మంది సభ్యుల తోటి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## ఇద్దరి ప్రాణం బలిగొన్న ట్రాక్టర్ ట్రాలీ
### రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని ఇద్దరి మృతి

**కనగల్ ఏప్రిల్ 10, మన సాక్షి:**

నిర్లక్ష్యం ఖరీదు రెండు ప్రాణాలు బలితీసుకుంది. అజాగ్రత్తగా రాత్రివేళలో రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీ నిలపడంతో రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. రోడ్డుపై నిలిచి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఒకదాని తర్వాత ఒకటి వేరువేరుగా రెండు ఘటనలు గంట వ్యవధిలోనే జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. నల్లగొండ జిల్లా కనగల్ మండలం 565 జాతీయ రహదారి నల్లగొండ – సాగర్ రోడ్డు పై బాబాసాహెబ్ గూడెం స్టేజి సమీపంలో బుధవారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. కనగల్ ఎస్సై విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... అనుముల మండలం బంటువారిగూడెంకు చెందిన చింతకాయల కిరణ్ (32) అతనికి వరుసకు తమ్ముడైన జినుకల అఖిల్ లు బైక్ పై స్వగ్రామం నుంచి కనగల్ మండలం తుర్కపల్లికి వస్తుండగా మార్గమధ్యలోని బాబాసాహెబ్ గూడెం స్టేజి సమీపంలో రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కిరణ్ తలకు తీవ్ర గాయాలు కావడం, అదే బైక్ పై వెనక కూర్చున్న అఖిలకు సైతం తీవ్రగాయాలు కావడంతో ఇద్దరు బాధితులను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి స్థానికుల సాయంతో తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ పరీక్షించే లోపే కిరణ్ మృతి చెందగా, అఖిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు కనగల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**అదే ట్రాలీని ఢీకొని ఇంకొకరు మృతి:**
రోడ్డుపై నిలుచున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని ఒకరు మృతి చెందగా.. పోలీసుల అక్కడికి చేరుకొని ఘటనా స్థలంలో క్లియర్ చేస్తున్న సమయంలోనే గంట వ్యవధిలో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీనీ మరో బైక్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కనగల్ ఎస్సై విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.... గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన బలుగూరి శేఖర్ (43) మిర్యాలగూడలోని ఓ బట్టల షాపులో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని మిర్యాలగూడ నుంచి బైక్ పై ఒక్కడే స్వగ్రామం తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని కనగల్ మండలం బాబాసాహెబ్ గూడెం స్టేజి సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శేఖర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీని నిలపడం, అదే చోట గంట వ్యవధిలోనే రెండు ఘటనలు జరిగి ఇద్దరి మృతికి కారణమైన ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## కంగ్టీలో సిద్దేశ్వర ఆలయ భూముల సాగుకు వేలం



**కంగ్టి , ఏప్రిల్ 10, మన సాక్షి:**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయం సాగు భూములకు వేలంపాట స్థానిక ఈవో శివరుద్రప్ప సమక్షంలో ఆలయ చైర్మన్ దారం ఎంకన్న ఆధ్వర్యంలో స్థానిక గణేష్ మందిరం ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఇందులో మీది అసామి భూమికి రూ. 3.05 లక్షలు, నడిమి అసామి రూ. 3.11 లక్షలు, కింది అసామి సాగు భూమికి రూ. 1.80 లక్షలకు గ్రామానికి చెందిన రైతులు వేలం పాటలో దక్కించుకున్నారని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంగమేశ్వర్, గ్రామస్థులు ఉన్నారు

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**నడిగూడెం ఏప్రిల్ 10,మన సాక్షి:**



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని నడిగూడెం, నారాయణపురం, రత్నవరం గ్రామాలలో పిఎసిఎస్, ప్రభుత్వ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకుని నాణ్యమైన ధాన్యమును ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న కింటాకు 500 రూపాయల బోనస్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం పిఏసిఎస్ చైర్మన్ కొల్లు రామారావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు శ్రీనివాస్, దున్నా దేవబత్తిని రమేష్ ప్రసాద్,దున్నా శ్రీనివాస్, గడ్డం మల్లేష్ యాదవ్,వినయ్ వర్ధన్ బాబు,శెట్టి సతీష్, గుండు మహీందర్ గౌడ్,వట్టికూటి గురునాథం,భారీ వెంకన్న,బొడ్డు గోవర్ధన్, వేల్పుల సోమయ్య, కంభంపాటి శ్రీనివాస్, లంజపల్లి సైదులు,ఎలక వెంకటరెడ్డి,సుధీర్ రెడ్డి, శ్రీను,డైరెక్టర్ల వెంకటరెడ్డి, సుధాకర్ రెడ్డి,బొందయ్య,ఏపిఎం రామలక్ష్మి, ఆర్ఐ గోపాల్ రావు, సిఈఓ కిరణ్, పంచాయతీ కార్యదర్శి పృద్వి,ఐకెపి సిబ్బంది జ్యోతి, మంజుల,భవాని, దుర్గాప్రసాద్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో నెల రోజుల పాటు పోలీసు యాక్ట్ అమలు
### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ, ఏప్రిల్ 10, మన సాక్షి:**



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే,చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు




**రామసముద్రం,ఏప్రిల్ 10,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా మండలం దిన్నిపల్లె సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ ల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మారినట్లు ఏపీ మోడల్ ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ గురువారం ఆయన తెలిపారు. ఈ నెల 20 నఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించామన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగ రావడంతో ఈనెల 21 సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు.

## బీసీలకు కల్వకుంట్ల కవిత క్షమాపణ చెప్పాలి

**నల్లగొండ ,ఏప్రిల్ 10 ,మన సాక్షి:**



ఢిల్లీలో బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పోరుగర్జన సభను ఉద్దేశించి అదొక తుపేలుదీక్ష అని అనుచిత వ్యాఖ్యలు చేసిన కల్వకుంట్ల కవిత ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని యావత్ బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ డిమాండ్ చేశారు బీసీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు కల్వకుంట్ల కవిత అగ్రకులానికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడిన మీకు మీ రాజకీయపబ్బం గడుపుకోవటం కోసమే పూలే విగ్రహాల కోసం దొంగ దీక్షలు చేస్తున్నావని దుయ్యబట్టారు. నిజంగా మీకు బీసీల మీద చిత్తశుద్ధి ఉంటే పది సంవత్సరాల కాలంలో మీ తండ్రి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ ఒక్కనాడయినా బీసీల గురించి, పూలే విగ్రహం గురించి మాట్లాడినారా అని ప్రశ్నించారు. ఈ పది సంవత్సరాల అధికారం మీదే ఉన్నప్పుడు ఎందుకు అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వీర హనుమాన్ విజయయాత్ర

**నల్లగొండ ,ఏప్రిల్ 10 ,మన సాక్షి:**



ఈనెల 12న నల్గొండ పట్టణంలో బజరంగ్దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్రను ఘనంగా నిర్వహిస్తున్నట్లు బజరంగ్ దళ్ ప్రాంతం కన్వీనర్ కన్నబోయిన వెంకట్,జిల్లా కన్వీనర్ నరసింహా పట్టణ అధ్యక్షుడు రాయల కృష్ణయ్య తెలిపారు. గురువారం బజరంగ్దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ యాత్రకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి పట్టణంలోని పాతబస్తీ హనుమాన్ దేవాలయం నుండి వీటి కాలనీ హనుమాన్ దేవాలయం వరకు వీర హనుమాన్ విజయ యాత్ర సాగుతుందన్నారు. హిందూ బంధు మిత్రులందరు విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కార్యకర్తలు వివిధ క్షేత్ర కార్యకర్తలు వివిధ కుల సంఘాల నాయకులు పార్టీలకు అతీతంగా హిందూ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శి జూకురి సంపత్ వర్మ,జిల్లా సత్సంగ్ ప్రముఖ్ బల్లేం యాదగిరి,జిల్లా కో కన్వీనర్ మారోత్ శ్రీనివాస్,నగర కన్వీనర్ గడ్డం శంకర్,నగర కో కన్వీనర్ వీరమళ్ళ ప్రభాకర్,కన్వీనర్ రంగరాజు స్వాతిక్,చర్లపల్లి అశోక్, జిల్లా దర్మ ప్రచార ప్రముఖ్ కోటగిరి సంతోష్,దర్మాచర్య సంపర్క ప్రముఖ్ ఉంధ్యాల ప్రకాష్ రెడ్డి, జిల్లా సేవ ప్రముఖ్ చిలుకూరు గోవర్ధన్, నగర సహ సురక్ష ప్రముఖ్ పృద్వి, యాదగిరి గౌడ్,నగర సేవ ప్రముఖ్ మల్లబోయిన రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



**నల్లగొండ, ఏప్రిల్ 10, మన సాక్షి:**

బిఆర్ఎస్ పార్టీ ఈనెల 27న వరంగల్లో తలపెట్టిన రజితోత్సవ సభను విజయవంతం చేయాలని నల్గొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సభకు అన్ని గ్రామాలు, వార్డుల నుంచి బిఆరెస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. దీని కోసం 13 వ తేదీ నల్లగొండ లక్ష్మి గార్డెన్స్లో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తాం అని తెలిపారు. కెసిఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్న సమయం లో తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చారాన్నారు. కానీ నేటికీ ఆరు గ్యారంటిలతో పాటు ఏది అమలు చేయడం లేదని విమర్శించారు . సమాజంలో బి ఆర్ఎస్. కటికం సత్తయ్య గౌడ్. సైదిరెడ్డి బుర్ర సుధాకర్. రేగటి మల్లికార్జున్ రెడ్డి రావుల శ్రీనివాస్ రెడ్డి దీప వెంకటరెడ్డి జమాల్ ఖాద్రి భువనగిరి దేవేందర్ తండు సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కనులు పండువగా శ్రీ సీతా రాములు కళ్యానోత్సవం



**రామసముద్రం,ఏప్రిల్ 10,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా మండల సమీపంలోని చెన్నయ్య గారి పల్లె వెలిసిన రామాలయంలో సీతా రాములు వారి కళ్యానోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలు భాగంగా గురువారం శ్రీ లక్ష్మి జనార్ధన స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ ఉదయం ఆలయ శుద్ధి చేసి స్వామి వారికి వేద పండితులతో కళ్యానోత్సవం నిర్వహించారు. కళ్యానోత్సవం ను తిలకించిన గ్రామస్తులు, భక్తులు. ఆలయఅర్చకులు భక్తులకు దర్శన బాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామ స్థులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

**గుర్రంపోడు, ఏప్రిల్ 10,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని అమలురు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల చిన్న రాములు (60) తనకు గల సుమారు 70 గొర్రెలను మేపుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గొర్రెలను మేపడానికి వెళ్లిన రాములు గురువారం సాయంత్రం గాలి దుమారం, వడగళ్ల తో పాటు ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి చెట్టు కింద తలదాచుకునేందుకు వెళ్లాడు. రాములు తలదాచుకున్న కొద్ది దూరంలోనే అకస్మాత్తుగా పిడుగు పడటంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు కు కొద్ది దూరంలో ఉన్న చిన్న కుమారుడు నరసింహ అతని దగ్గరికి వెళ్లే లోపే విగత జీవిగా కనిపించాడు. పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతిచెందడం తో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం


**కుల్కచర్ల, ఏప్రిల్ 10, మన సాక్షి:**



కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో ఏప్రిల్ 12న జరిగే ప్రపంచ మేధావి, నవ భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మరియు భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు భారీ ఎత్తుగా తరలిరావాలని అంతారం, కుష్మ సముద్రం, అనంతసాగర్, ఇప్పాయిపల్లి గ్రామాలకు దళిత సంఘాల నాయకుడిని కలసి ఆహ్వానిత పత్రం అందజేసి ప్రతి ఒక్క దళితుడు ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షులు కర్రె భరత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ కనుక మొగులయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగని వెంకట్ రాములు, ఏఎంసీ డైరెక్టర్ నాగని ఎల్లయ్య, బాబు, భాను, నాగేరి భీమయ్య, దగ్గుల సురేష్, తలారి బిచ్చయ్య, గడ్డమీది వెంకట నరసింహులు, డప్పు బచ్చయ్య, అంతారం మాజీ సర్పంచ్ దగ్గుల కృష్ణ, వెంకట్ రాములు, నాగేరి మొగులయ్య, దగ్గుల వెంకటయ్య, డప్పు మొగలయ్య, దండం అంజి, గడ్డమీది వెంకట్రాముడు,దూరేటి రాములు,డప్పు వెంకటేష్, హనుమంతు గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ వాల్ పోస్టర్ విడుదల

**దోమ,ఏప్రిల్ 10,మన సాక్షి:**



ఈ నేల 12న పుట్టపహాడ్ గ్రామంలో అంబేద్కర్ విగ్రావిష్కరణ కార్యక్రమానికి మోత్కూరు అంబేద్కర్ యూత్ గ్రామస్థుల తో కలిసి వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి బ్లాక్ బి అధ్యక్షులు కర్రె భారత్ కుమార్, కుల్కచర్ల పిఎసిఎస్ చైర్మన్ కనకం మోగులయ్య,సెక్రెటరీ వెంకటేష్, నర్సిములు టీచర్,గూడ సారంగి, రీపోటర్ కృష్ణ, గట్టు రాజు, శ్రీనివాస్, మల్లేశం,మోత్కూర్ అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ పరీక్షలు బహిష్కరణ

**చింతపల్లి,ఏప్రిల్ 10,మన సాక్షి:**

ఫీజు రియంబర్స్మెంట్ పూర్తిగా విడుదల అయ్యేవరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ పరీక్షలను బహిష్కరణ చేస్తున్నామని మహాత్మా గాంధీ యూనివర్సిటీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సూదిని మోని హనుమంత్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ లో భారత్ జూనియర్,డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరములుగా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయకపోవడం వలన మహాత్మాగాంధీ యునివర్సిటీ లో నడపబడుతున్న ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి నడుపుతున్న గ్రామీణ కళాశాలలు ఆర్థికంగా పూర్తిగా నష్టాలలో ఊబిలో కూరుకుపోయాయని వారు ఆవేదన వ్యక్తపరిచారు.గత ఒకటిన్నర సంవత్సర కాల%శీ%గా భవన అద్దె బకాయిలు కూడ చెల్లించలేని పరిస్థితిలో యాజమాన్యాలు ఒత్తిడి,కి గురవుతున్నాయన్నారు.కళాశాలలో పనిచేసే అధ్యాపకులకు గత ఆరు, ఏడు నెలల జీతాలు ఇవ్వనందున తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొన్నది అన్నారు.గత మూడు సంవత్సరాల నుండి అప్పులు తెచ్చి కళాశాల నిర్వహిస్తున్నము, కనీసం వాటికి వడ్డీలు కూడా కట్టే పరిస్థితి లేదు, రోజువారి నిర్వహణ ఖర్చులు వెళ్లకపోవడం వల్ల గ్రామీణ కళాశాలల మేనేజ్మెంట్ పరిస్థితి జీవన్మరణ సమస్యగా మారిందని వాపోయారు .కొంత మంది మేనేజ్మెంట్ అప్పులవాడి బాధ భరించలేక ఆరు నెలలుగా కళాశాల కు దూరంగా కాలం గడుపుతున్నారన్నారు.నల్గొండ జిల్లా లో ఇరువురు మంత్రులు ఉన్నప్పటికీ,నిరుపేద మధ్యతరగతి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ పై స్పందించకపోవడం బాధాకరమన్నారు. పూర్తిగా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పై ఆధారపడి చదువుకునే వారికి 16 నెలల అవుతున్న ఒక్క రూపాయికూడ విడుదల చేయించ లేకపోయారని ఆవేదన వ్యక్తపరిచారు.. పలుమార్లు మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసిన స్పందన లేదన్నారు. . ప్రభుత్వం స్పందించని కారణంగా తెలంగాణ ప్రైవేట్ మేనేజ్మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు మహాత్మాగాంధీ లో ఏప్రిల్ 2వ తారీకు నుండి 9వ తారీకు వరకు జరగవలసిన డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరించడం జరిగిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడారి ఆంజనేయులు యాదవ్,భారత్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## సోలిడార్ తెలంగాణ విద్యార్థులకు ఎస్ఐ అభినందనలు

**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 10,మన సాక్షి:**



సోలిడార్ తెలంగాణ భధిర పాఠశాల విద్యార్థులకు కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి అభినందనలు తెలియజేశారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయ స్థాయి క్రీడలలో సోలిడార్ తెలంగాణ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు.ఈ సందర్భంగా సోలిడార్ తెలంగాణ పాఠశాల నిర్వహకులు కొండమల్లేపల్లిలో 80 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభానికే పరిమితం కాకుండా విద్యార్థులతో కలిసి ర్యాలీలో పూర్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర బలం కన్నా బుద్ధిబలం గొప్పదని ఇట్టి విషయాన్ని గ్రహించి విద్యార్థులు క్రీడలలో రాణించడం అభినందనీయమన్నారు. ఇక ముందు ఇంకా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మీ తల్లిదండ్రులకు తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి పేరు తెచ్చేలా కృషి చేయాలన్నారు .ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులను ఎస్సై అభినందించారు. కార్యక్రమంలో కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుండిగల్ల అశోక్, సోలిడార్ తెలంగాణ పాఠశాల డైరెక్టర్ దార్ల భాస్కర్, నిర్వాహకులు సురేష్ కుమార్, ఏరుకొండ చంద్రయ్య, వినోద్, సైదా నాయక్, వెంకటమ్మ, సంపత్ ,కవిత తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్



**కుల్కచర్ల, ఏప్రిల్ 10,మన సాక్షి:**

కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్పూర్ గ్రామం నుండి పరిగి వెళ్లే మార్గ మధ్యమంలో రామ్ రెడ్డి పల్లి దగ్గర ఇటీవల వీచిన గాలి వాన దుమారంతో చెట్టు విరిగి నడిరోడ్డుపై పడటంతో అటు ఇటుగా వస్తున్న కుల్కచర్ల మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పోమాల అనంతయ్య ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోయిన కృష్ణయ్య కలసి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి వాహనాల రాకపోకులకు అంతరాయం కలగకుండా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోయిన భీమయ్య, టప్ప రాములు, బోయిని పిచ్చయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై అవగాహన: సీఐ చరమంద రాజు




**హుజూర్‌నగర్, ఏప్రిల్ 10,మన సాక్షి:**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హుజూర్ నగర్ పట్టణం గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు, చోరీల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరంగా చర్చించారు. సీఐ మాట్లాడుతూ, ప్రజలు తమ సొంత ఇంటిని దొంగల బారి నుంచి కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆటో క్యాన్వాసింగ్ ద్వారా కూడా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో హుజూర్ నగర్ ఎస్ఐ ముత్తయ్య, మఠంపల్లి ఎస్ఐ బాబు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్ర నాయక్, పాలకీడు ఎస్ఐ లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమిని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**రామసముద్రం,ఏప్రిల్ 10,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జిదారులపై సంబంధిత అధికారులు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని యర్రబోయని పల్లెలో రైతులు వెంకటప్ప,పాపిరెడ్డి మధ్య నెలకొన్న వివాదాస్పద భూమిని జెసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివాదాస్పద భూమిని, భూమికి సంబంధించిన రికార్డులను స్థానిక తహసీల్దార్ నిర్మలాదేవి సమక్షంలోపరిశీలించారు.అనంతరం బాధిత రైతులతో మాట్లాడుతూ త్వరలో భూ సమస్యను పరిష్కరిస్తామని జె సి తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో డి టీ, విఆర్ఓ లు,అర్ ఐ,సర్వేయర్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న భూరీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజం వెంకటరమణ,గ్రామస్తులు చలపతి నాయుడు జె సి తో మాట్లాడుతూ తహసీల్దార్ నిర్మలదేవి ప్రజా ప్రతినిధులతో అమర్యాదగా ,పరుష పదజాలంతో మాట్లాడుతున్నారని, ఫ్యామిలి సర్టిఫికెట్ కోసం స్థానిక విఆర్ఓ,అర్ ఐ అనుమతి ఇచ్చినా మొత్తం కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఇబ్బందుల గురిచేస్తున్నారని, అంతేకాకుండా సమస్యలతో వచ్చే అర్జిదారులను ఉదయం పదకొండు గంటల నుండి రెండు గంటల వరకే అనుమతిఇస్తున్నారని ఆపై వచ్చే అర్జిలు స్వీకరించకపోవడంతో సుదూర గ్రామాలనుండి వచ్చిన అర్జిదారులు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారని,ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే రోజు కూడా ఉదయం పది నుండి స్థానిక విఆర్ఓలతో మీటింగ్ పెట్టుకొని అర్జిదారులు గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని జె సి కి తహసీల్దార్ పై పిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన జె సి అర్జిదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలి,రైతులు ఎప్పుడు తహసీల్దార్ కార్యాలయంకు వచ్చినా అర్జిలు స్వీకరించాలని తహసీల్దార్ ను ఆదేశించారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**దోమ,ఏప్రిల్ 10,మన సాక్షి:**

మండల పరిధిలోని రకొండ తండాకు చెందిన గోవింద్ నాయక్ 60,వేల రూపాయలను సిఎం సహాయ నీది నుండి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సహకారంతో చెక్కును భాధితునికి అందజేయడం జరిగిందనీ బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు మచ్చేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ చాపల వెంకటమ్మ వెంకటయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ,నర్సింగ్ నాయక్, పాండ్య నాయక్,లక్ష్మణ్, మంగ్య నాయక్,తదితరులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**పెన్ పహాడ్,ఏప్రిల్ 10,మన సాక్షి:**



ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ ధరావత్ లాల్ నాయక్ తెలిపారు.గురువారం పెన్ పహాడ్ మండల కేంద్రం గాజుల మల్కాపురం,గ్రామాలలో పిఏసి ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ 2320 రూపాయలు కల్పించి. బోనస్ 500 రూపాయలు చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుభ్రపరచిన ధాన్యమును రైతులు కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చునన్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో అనిల్ కుమార్,ఏఈఓ స్వప్న, పీఏసీఎస్ డైరెక్టర్ గూడేపురి రవి. పి ఏసిఎస్ సీఈఓ మాలోతు సోమ్లా నాయక్,పిఏసి ఎస్ సిబ్బంది ఒగ్గు సైదులు,లక్ష్మణ్ రవీందర్ వెంకన్న బిఆర్ ఎస్ జిల్లా నాయకుడు తూముల ఇంద్రసేనారావు,రిటైర్డ్ టీచర్ రంగనేని లక్ష్మీకాంతరావు, రైతులు. రంగినేని విజయకుమార్. దాసరి శ్రీనివాస్,మలిగిరెడ్డి స్వప్న, పానుగోతు సూర్యనారాయణ, వీరబోయిన లింగయ్య బొల్లక రామయ్య,రాములు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉండాలి



**కుల్కచర్ల, ఏప్రిల్ 10,మన సాక్షి:**

భారత సుదీర్ఘమైన రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి భారతీయుడి దాని డిసిసి అధ్యక్షులు ఉపాధ్యక్షులు బోలు సని భీమ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు అన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాష్ట్ర ప్రభుత్వం జై బాబు,జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమాన్ని పరిగి శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాలు ప్రకారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... గ్రామ గ్రామాన భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం కొన్ని నినాదంతో యాత్రను ప్రారంభించి బిజెపి చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని కృష్ణయ్య, గుండా బాల కృష్ణయ్య, పి భాస్కర్, సోమలింగం, రాతికింది శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి



**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10, మన సాక్షి :-**

ఈనెల 27న వరంగల్ లో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సింగారం కూడలి దగ్గర ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ శాసన సభ్యుడు,జిల్లా బి.ఆర్.ఎస్.పార్టీ అధ్యక్షుడు యస్.రాజేందర్ రెడ్డి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురవేసి వరంగల్ బహిరంగ సభకు తరలిలా రావాలన్నారు. ఈ నెల 27వ తేదిన జరిగే భారీ బహిరంగంగా సభకు కార్యకర్తలు నాయకులు భారీగా తరలి రావాలని బహిరంగ సభను సక్సెస్ చెయ్యాలని ఆయన కార్యకర్తలను, నాయకులను కోరారు. నారాయణ పేట నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా కార్యకర్తలు హాజరు కావాలని, పార్టీ ఆదేశాలతో అన్ని కార్యక్రమాల్లో నారాయణ పేట నియోజకవర్గ కార్యకర్తలు అద్భుతంగా కష్టపడుతున్నారని రాష్ట్ర నాయకత్వం అభినందించారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన అందరూ కార్యకర్తలు వరంగల్ బహిరంగ సభకి తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ అధ్యక్షుడు విజయ సాగర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీజే ఫ్ ఆధ్వర్యంలో రిలే దీక్ష

**పెద్దపల్లి,ధర్మారం,ఏప్రిల్ 10,మన సాక్షి:**




పెద్దపల్లి డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్, (డీజేఫ్ ) ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు,వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్,చేశారు, ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కుమార్ ఆధ్వర్యంలో జరగక డీజేఎఫ్ జాతీయ నాయకులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మోట పలుకుల వెంకట్, ధర్మారం డీజే ఎఫ్ అధ్యక్షులు నరసయ్య, డీజే ఫ్ ఉపాధ్యక్షులునాయకురాలు, పిట్టల స్వరూప, పెంచాల శ్రీధర్, మరి కొంతమంది పాల్గొన్నారు,

## ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి




**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 10,మన సాక్షి:**

చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో జమైత్ ఉల్ అన్సార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం తర్వాత ప్రతీ ఏడాది ముస్లిం వెల్ఫేర్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈద్ మిలాపలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాప్ జరుపుకుంటారని అన్నారు. ముస్లిం మైనార్టీల కోసం రాష్ట్ర ప్ర భుత్వం ఎన్నో కార్యక్రమాలకు చేపడుతోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, జమయిత్ ఉల్ అన్సార్ శేరిలింగంపల్లి ఈద్ మిలాప్ సెలెబ్రేషన్స్ ప్రెసిడెంట్ మసూద్ అలీ మహ్మద్ ,జనరల్ సెక్రటరీ మహ్మద్ అజిజ్ ఉల్ హాక్,జాయింట్ సెక్రటరీ మహమ్మద్ అక్రముద్దీన్, మొహ్మద్ జాఫర్ అహ్మద్, ట్రెజరర్ మహ్మద్ షబీర్ అహ్మద్ మొహమ్మద్ బేగ్, అక్బర్ ఖాన్, యూసఫ్, అంజాద్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దామరచర్ల,ఏప్రిల్ 10,మన సాక్షి:**

విద్యుత్ అంతరాయానికి వినియోగదారుల సహకరించాలని మండల విద్యుత్ అధికారి అబ్దుల్లా హబీబ్ ప్రకటనలో తెలియజేశారు. నేడు శుక్రవారం ఉదయం 6:00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుదనీ దామరచర్ల సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ మరియు కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ వర్క్ చేస్తున్నారనీ కనుక దామరచర్ల టౌన్ ఫీడర్,నర్సాపురం ఫీడర్, బొత్తలపాలెం ఫీడర్, వాచ్య తండ జిపి ఫీడర్,వాడపల్లి ఫీడర్, దామరచర్ల ఏజీయల్ ఫీడర్,దామరచర్ల లిఫ్ట్ ఫీడర్,టీవీ గూడెం ఏజ్ ఎల్ ఫీడర్ ల కింద ఉన్న గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కనుక విద్యుత్ వినియోగదారులందరూ సహకరించలని తెలియజేశారు.

# చిన్న హనుమాన్ జయంతికి పటిష్ట భద్రత

## సీసీ కెమెరాలు ద్వారా నిరంతర పర్యవేక్షణ: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**జగిత్యాల, ఏప్రిల్10,మన సాక్షి:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా,ఎలాంటిహాఅ వాంఛనీయ సంఘటనలు జరగకుండా 900 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బందోబస్తుని 6 సెక్టార్స్ గా విభజించి 3 షిప్టుల పద్ధతిన విధులు కేటాయించడం జరిగిందిని ఎస్పీ అన్నారు. ఈ సందర్బంగా హనుమాన్ జయంతి బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండాహాహావిధులు నిర్వహించాలని సూచించారు.

ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో సలహాలు, సూచనలు ఇస్తూ భక్తుల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని, ఎక్కడ కూడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ముఖ్యంగా దేవస్థానం,మాల విరమణ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటలు పోలీస్ నిఘా ఉంచాలని ప్రతి ఒక్క భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేవిధంగా ప్రతి పోలీస్ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పార్కింగ్ ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందునహాభారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని, ట్రాఫిక్ ,పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ అవకుండా నియంత్రణ చేయాలన్నారు.

రాత్రి వేళలో ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, కోన్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాటలను పరిశీలించి అదికారులకు పలు సూచనలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా కాలి నడకన వచ్చే భక్తులు రోడ్డుపైన వెళ్ళే వాహనాలు గమనిస్తూ నడవాలి హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు వచ్చే సమయం లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రేడియం స్టికర్స్ ను వారి బ్యాగులకు, జెండా కు అంటించడం జరిగింది.

రోడ్డుకు ఇరువైపులా నడుస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని వాహనాలను గమనిస్తూ తమ యొక్క గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలోహా డిఎస్పిలు రఘు చందర్, రాములు, రంగారెడ్డి,ఎస్బి ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్,సి.ఐలు రవి ,రామ్ నరసింహారెడ్డి, సురేష్ ,అనిల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సి.ఐలు, ఎస్.ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవాలి




**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 10 మనసాక్షి :-**

రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం రాజీవ్ యువ వికాసం పథకంపై కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ సంబంధిత శాఖల అధికారులతో రాజీవ్ యువ వికాసం,ఎన్ఆర్ఈజీఎస్, యూనిఫామ్ కుట్టుపని, లోగోస్ డాటా ఎంట్రీ, జీవిత భాగస్వామి పెన్షన్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా జిల్లాలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులైన వారు ఈనెల 14 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ క్రింద టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఉదయం ఏడు గంటలకు ఫీల్డ్ లోకి వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. వరి ధాన్యం తడవకుండా చూడాలని టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. లేబర్ ను ఎక్కువగా ఏర్పాటు చేసి ఎఫ్ టి ఓ జనరేట్ చేయాలన్నారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీడీవోలకు గ్రీవెన్స్ వస్తున్నవి వాటిని క్లియర్ చేయాలన్నారు 100% అర్హత గలవారు ఉండాలన్నారు. స్కూల్ యూనిఫార్మ్ కొలతలు తీసుకుని కొట్టాలని ఆదేశించారు. ఆరు ఏడు తరగతుల వాళ్లకు బాయ్స్ పాయింట్స్ కొలతలు ఈనెల 23 లోపు ఇవ్వాలన్నారు. గ్రామాలలో త్రాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. పెన్షన్స్ ఫోకస్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్. పి. సి. ఈ. ఓ.డి ఆర్ డి ఓ మొగులప్ప, హౌసింగ్ పి. డి.ఈ. డి. ఎస్. సి. కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్, మైనారిటీ అధికారి రషీద్, ఎం పిడిఓలు. ఎపిఓఎపిఎం లు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో పేదల ఇళ్లలో సన్న బియ్యం పండుగ







**మిర్యాలగూడ, ఏప్రిల్ 10, మన సాక్షి :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. కాగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గురువారం పేదల ఇళ్లలో సన్న బియ్యం పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదల ఇళ్లలో స్థానిక శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి పిలుపు మేరకు పట్టణంలోని అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు పేదల ఇళ్లలో భోజనాలు చేసి పండుగ జరుపుకున్నారు. దాంతో మిర్యాలగూడ పట్టణ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొన్నది. ఈదులగూడెం, హౌసింగ్ బోర్డు ఐదవ వార్డులో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి మహిళలతో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. అదేవిధంగా పట్టణంలోని 24వ వార్డులో సన్న బియ్యం లబ్ధిదారుడు షఫీ నివాసంలో కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్చార్జ్ మొలాల కరుణ, అమృత రెడ్డి ఆధ్వర్యంలో భోజనాలు చేసి పండుగ జరుపుకున్నారు. అదేవిధంగా 25వ వార్డు లో వార్డు ఇన్చార్జ్ గోదాల జానకి రామ్ రెడ్డి, కవిత ఆధ్వర్యంలో సన్నబియ్యం లబ్ధిదారుల నివాసంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రాథోడ్, సైదులు, పాష, విజయ, వెంకటలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్.ఈ వెంకట రమణకి సన్మానం



**నారాయణపేట టౌన్, ఎప్రిల్ 10, మన సాక్షి :**

నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం నూతన ఎస్.ఈ. వెంకటరమణ ను 1104 యూనియన్ నారాయణపేట డివిజన్ డివిజన్ ప్రెసిడెంట్ మొగులప్ప, డివిజన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె రఘు , ప్రవీణ్ , జె.ఎల్.ఎం. రవి లు. కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్. ఈ. వెంకటరమణ మాట్లాడుతూ విధినిర్వహణలో తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. నిరంతరం విద్యుత్ కు అహర్నిశలు తమ ఆపరేషన్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఫీజఫ్ కాల్ అటేండ్ చేయ్యాటంలో క్షేత్ర స్థాయి ఏ.ఈ. లతో మమేకమై పనిచేస్తారని తమ అభిప్రాయాన్ని ఎస్.ఈ. వెంకటరమణతో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. చాంబర్ డి.ఈ. నర్సింగ్ రావు లు ఉన్నారు.

# రైతులకు మద్దతుల ఇప్పించడంలో ప్రభుత్వాలు విఫలం

**మిల్లులో అమ్ముకున్న ధాన్యానికి బోనస్ ఇవ్వాలి**

**గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం**

**ట్రంపు సుంకలతో ప్రజలకు మరింత కష్టాలు**

**హామీలు గ్యారెంటీగా అమలు చేయాలి: విలేకరుల సమావేశంలో జూలకంటి**



**మిర్యాలగూడ,ఏప్రిల్ 10, మన సాక్షి:**

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ఇప్పించడంలో కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కూడా ఇప్పించలేకపోతున్నారని దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిల్లుల వద్ద ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్లిన రైతులకు అనేక రకాలుగా మోసం చేస్తున్నారని వాటిని అరికట్టాల్సిన అధికారులు పర్యవేక్షించుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఐకెపి పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు అక్కడ ధాన్యాన్ని అమ్ముకోవడం లేదని మిల్లులకే ఎక్కువగా ధాన్యం అమ్ముకుంటున్నారని మిల్లుల్లో అమ్ముకున్న ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే రైతులకు కనీసం మద్దతు ధర అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కావొస్తుందని రెండు సీజన్లు దాటిపోయాయని కనీసం రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. వచ్చే సీజన్ నాటికైనా పాతవి కలిపి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ ఇంకా పదివేల కోట్ల పెండింగ్ ఉందని వెంటనే విడుదల చేసి అందరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారం పడిందని ఆరోపించారు. చమురు ధరలు తగ్గిన గ్యాస్ ధరలు పెంచడం సరైనది కాదన్నారు.

# జై బాపు, జై భీమ్ నినాదాలతో మారుమోగిన మిర్యాలగూడ



**మిర్యాలగూడ, ఏప్రిల్ 10 , మనసాక్షి :**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం జై బాపు, జై భీమ్ నినాదాలతో మారుమోగింది. గురువారం సాయంత్రం జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, నాయకులు చిలుకూరి బాలు, శేఖర్ రెడ్డి , జలంధర్ రెడ్డి, జానకి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో సన్న బియ్యం పండుగ

**మిర్యాలగూడ , ఏప్రిల్ 10, మన సాక్షి :**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గురువారం సన్నబియ్యం పండుగ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పథకం విజయవంతమైంది. ఈ పథకం ద్వారా రేషన్ కార్డు ఉన్న వారందరికీ ఉచితంగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసింది. దాంతో లబ్ధిదారుల నివాసాల్లో గురువారం పండుగ నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని అన్ని వార్డులలో సన్నబియ్యం లబ్ధిదారుల ఇళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు భోజనాలు చేసి పండుగ నిర్వహించారు. పట్టణంలోని సుందర్ నగర్ కు చెందిన సన్నబియ్యం లబ్ధిదారులు ఆటో నాగయ్య తో పాటు పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సన్న బియ్యం లబ్ధిదారుల నివాసాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, భోజనాలు చేశారు. ఎమ్మెల్యే భత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిఎస్పి రాజశేఖర్ రాజు, తాసిల్దార్ హరిబాబు పాల్గొని భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల పేదలు తినలేకపోయారని, తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడంతో కడుపునిండా తింటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలు అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నారని అన్నారు.



# పర్యావరణంతో అల్లుకున్న తీగబంధం

గాలి కలుషితమైంది... ఒక మొక్క నాటండి. బాగా వేడిగా ఉంటోంది... ఒక మొక్క నాటండి. నేల పాడైంది... ఒక మొక్క నాటండి. ఆహార కొరత ఏర్పడింది... ఒక మొక్క నాటండి... పర్యావరణ హితాన్ని ఆకాంక్షించే ఈ నినాదాలను హైదరాబాద్ మల్కాజిగిరికి చెందిన డ్రైవర్ ప్రదీప్ తన ఆటోపై రాశారు. మాటలకే పరిమితం కాకుండా కాలుష్య వ్యతిరేక ఉద్యమంలో తనవంతు పాత్రనూ పోషిస్తున్నారు. ఆటో వెలుపల తీగజాతి, మందార మొక్కలను పెంచుతున్నారు. లోపల దేవతామూర్తుల ఫొటోలను అతికించారు. ప్రయాణికుల కోసం తాగునీటి సీసాలు, తెలుగు, ఆంగ్ల దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రయాణికులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తుంటారు.



# సర్కారు బడుల్లోనూ ప్రీ ప్రైమరీ


హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా... ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి. పిల్లలకు మూడేళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని, దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావిస్తున్న ప్రభుత్వం.. శిశు విద్యను ప్రారంభించాలని నిర్ణయించింది. త్వరలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తామని, పిల్లలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి, టాస్ సంచాలకుడు శ్రీహరి తదితరులు సమావేశమై చర్చించారు.



# ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటా..

తన 16 ఏళ్ల కెరీర్‌పై రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జీవితంలో ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ముందుకు సాగాలన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ నటి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. "ఈ ఇండస్ట్రీలో జయాపజయాలు సహజం. అవి జీవితంలోనూ భాగమే. కెరీర్‌లో స్థిరపడే కొద్దీ మార్పులు వస్తాయి. ఎన్ని కష్టాలు వచ్చినా తిరిగి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగాలి. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధ్యమవుతుంది.

నా విషయానికొస్తే.. నేను ఎంత బిజీగా ఉంటే అంత ప్రశాంతంగా ఉంటాను. వరుస షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నప్పుడు ఒత్తిడిగా అనిపించదు. షూటింగ్స్ లేనప్పుడు విరామ సమయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతాను. ప్రతిరోజూ వర్క్‌కు వెళ్లడం, కెమెరాను ఎదుర్కోవడం నా జీవితంలో భాగమయ్యాయి. ఈ దినచర్యే నన్ను ఉన్నత స్థానానికి తీసుకువెళ్తుంది. ఎప్పటికీ ఇదే కొనసాగాలని కోరుకుంటున్నా" అని రకుల్ అన్నారు.



# అందుకే ఓపిక పట్టండి

## 'ది రాజాసాబ్' విడుదలపై మారుతి

ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' . ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే మూవీ రిలీజ్ గురించి ఓ ఫ్యాన్.. సోషల్ మీడియా వేదికగా దర్శకుడిని స్పష్టత కోరాడు. "కావాల్సినంత సమయం తీసుకోండి. అవుట్‌పుట్‌పై మీరెప్పుడు సంతృప్తిగా ఉంటే అప్పుడు 'రాజాసాబ్'ను రిలీజ్ చేయండి. కానీ, నవంబరులో వస్తుందా? వచ్చే ఏడాదా? ఇంకెప్పుడైనా? అన్నది మీడియా ద్వారా అధికారిక సమాచారం ఇవ్వండి. అభిమానులు ఇబ్బంది పెట్టరు" అని పేర్కొన్నాడు. దీనిపై మారుతి స్పందిస్తూ.. "పీపుల్ మీడియా ఫ్యాక్టరీ (నిర్మాణ సంస్థ) మీకు ఆ సమాచారం ఇస్తుంది. సీజీ వర్క్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత నిర్మాతలు విడుదల తేదీ ప్రకటిస్తారు. ఈ ప్రాసెస్‌లో ఎన్నో అంశాలు ఇన్వాల్వ్ అయి ఉంటాయి. ఇది ఒక్కరు చేసే పని కాదు. అందుకే సమయం పడుతుంది. కాస్త ఓపిక పట్టండి. మీ అంచనాలు అందుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడుతున్నారు" అని చెప్పారు.

"కొంచెం టాకీ పార్ట్, కొన్ని పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. మన సినిమా కోసం పలు సీజీఐ స్టూడియోలు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకూ వచ్చిన కొన్ని స్టూడియో అవుట్‌పుట్ బాగుంది. ఇతర స్టూడియోల వర్క్ కూడా అలానే ఉంటుందని ఆశిస్తున్నా. సాంగ్స్ షూటింగ్స్ పూర్తికాగానే లిరికల్ వీడియోలు రిలీజ్ చేస్తాం. మా హార్డ్‌వర్క్ మీకు చూపించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు.



# అవును..నేను ఒంటరినే



అవును...నేను ఒంటరినే అంటూ తమన్నా భాటియా సమాధానం ఇచ్చారు. తమన్నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. ఆమె కొన్నేళ్లుగా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వారిద్దరూ విడిపోయినట్లు కొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయని, అందుకే బ్రేకప్ చెప్పేసుకున్నారని తెలుస్తోంది. అయితే, బ్రేకప్ వార్తలపై వీరిద్దరూ ఎక్కడా స్పందించలేదు. 'ఓదెల 2'ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా పాల్గొంటున్న నటి తమన్నా తాజాగా జరిగిన ట్రైలర్ విడుదల ప్రచార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. నటుడు విజయ్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒక విలేకరి తమన్నాను ప్రశ్నించారు.దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. విజయ్ అనే పేరు ఎక్కడా రాకుండా ఆమె బదులిచ్చారు. కార్యక్రమంలో తమన్నాతోపాటు- ఇతర చిత్రబృందం పాల్గొంది. ఇందులోభాగంగా ఓ విలేకరి.. మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమీదనైనా విజయం సాధించాలనుకుంటున్నారా అని ప్రశ్నించింది. దీనిపై తమన్నా స్పందిస్తూ.. 'మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నేను నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీపై ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. నేను ఏం చెబితే అదే రాసుకుంటారని ఆమె సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. విజయ్ పేరు ప్రస్తావించడానికి కూడా తమన్నా ఇష్టం చూపించడం లేదని మాట్లాడుకుంటున్నారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. 'జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలను కుంటాం.

# అజిత్ ఇచ్చిన ధైర్యమే ముందుకు నడిపించింది



సీనియర్ నటుడు అజిత్‌ను కలిసిన తర్వాత తన జీవితమే మారిపోయిందన్నారు దర్శకుడు అధిక్ రవిచంద్రన్. ఆయన తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అజిత్‌పై ప్రశంసలు కురిపించారు. 22 ఏళ్ల దర్శకుడిగా తొలి సినిమాను తెరకెక్కించాను. ఆ తర్వాత ఓ సినిమా (అన్బానవన్ అసరాధవన్) ఫ్లాప్ అయింది. ఆ సమయంలో అజిత్ తప్ప నాకెవ్వరూ ధైర్యం చెప్పలేదు. ఆయన ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటినుంచి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అర్థమైంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెరకెక్కించే సమయంలో ఆయన గురించి మరింత తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన చుట్టూ ఉండే వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. ఆయన ఒక లెజెండ్. ఎవరినీ బాధపెట్టరు. ఎవరి గురించి చెడుగా మాట్లడరు. ఆయన కోసం ఎన్నో కాస్ట్యూమ్స్ తయారుచేశాం. వాటిని ఎంతో ఓపికగా ధరించారు' అని చెప్పారు.

అజిత్‌కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కోసం సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన –ట్రైలర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. అజిత్, త్రిషల మధ్య సంభాషణలు ఆకట్టు–కునేలా ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలోని 'గాడ్ బ్లెస్ యూ' అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం విడుదల చేసింది.

# వరుస ఫెయిల్యూర్స్‌తో కావ్య థాపర్ సైలెంట్

గత ఏడాది బాగా హడావుడి చేసిన బ్యూటీ కావ్య థాపర్ ఈ ఏడాది సైలెంట్ అయ్యింది. ఫ్లాప్స్ ఆమె కెరీర్ పై గట్టి దెబ్బే వేశాయి. స్టార్ హీరోలతో జోడీ కట్టినప్పటికీ ఇప్పుడు ఛాన్సుల కోసం వెయిట్ చేస్తోంది. ఈ మాయ ప్రేమేమిటోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కావ్య బేబీ ఈ ఏడేళ్లలో పది సినిమాలు కూడా చేయలేకపోయింది. కోలీవుడ్, బాలీవుడ్‌లోకి స్టెప్ ఇన్ అయినా పెద్దగా కలిసి వచ్చిందీ ఏమీ లేదు. ఏక్ మిని కథ, పిచ్చైకారన్ చిత్రాల్లో మంచి ఫెర్ఫామెన్స్ చూపించడంతో టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించే ఛాన్సులు కొల్లగొట్టింది కావ్య. అప్పటి వరకు ఏడాదికి ఒక్క మూవీ చేసుకుంటూ వచ్చిన భామ లాస్ట్ ఇయర్ నాలుగు సినిమాలతో పలకరించింది. రవితేజ ఈగల్, సందీప్ కిషన్ ఊరు పేరు భైరవకోన, రామ్ డబుల్ ఇస్మార్ట్, గోపీచంద్ విశ్వమ్‌లో గ్లామరస్ రోల్‌లో కనిపించింది కానీ ఊరు పేరు బైరవ కోన మినహా మిగిలివన్నీ డిజాస్టర్లు. ఈ హ్యాట్రిక్ ఫ్లాప్స్ ఆమె కెరీర్‌పై గట్టి దెబ్బేశాయి. పేలవమైన స్క్రిప్ట్స్ కావ్యను ఫేడవుటుకు దగ్గర చేశాయి. విశ్వం తర్వాత కాస్త గ్యాప్ తీసుకునేందుకు వెకేషన్స్‌కు వెళ్లిన కావ్య థాపర్ మళ్లీ కెరియర్ పై ఫోకస్ చేస్తోంది. ఓ సినిమాకు కమి–ట్రైనట్లు– టాక్. ధమాకా దర్శకుడు త్రినాథ రావు నక్కిన అప్ కమింగ్ ప్రాజెక్టులో ఓకే అయినట్లు– టీఎఫ్ఐలో బజ్ నడుస్తోంది. హవీష్ హీరోగా తెరకెక్కుతోన్న ఈసినిమా ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లినట్లు– సమాచారం.

# లెనిన్‌గా వస్తోన్న అక్కినేని అఖిల్



అఖిల్ అక్కినేని హీరోగా, మురళీ కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెనిన్'. అక్కినేని నాగార్జున, సితార ఎంటట్రంల్గ÷న్మెంట్స్ నాగవంశీ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు తాజాగా 'లెనిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అఖిల్ పుట్టిన రోజును పురస్కరించుకుని లెనిన్ టైటిల్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది కాదు.. అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ సినిమా గ్లింప్స్ చూస్తుంటే లవ్, యాక్షన్, రొమాన్స్, డివోషనల్ అంశాలతో తెరకెక్కించినట్టు– క్లియర్‌గా అర్థమవుతుది. ముఖ్యంగా తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అదిరిందనే చెప్పాలి. ఇదిలా ఉండగా లెనిన్ టైటిల్ గ్లిమ్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. యూట్యూబ్ లో టాప్ లో ట్రెండింగ్ అవుతోంది. ఈ విషయాన్ని మూవీ టీమ్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. అఖిల్ ను మునుపెన్నడు చూడని లుక్ లో కనిపించడం అటు ఫ్యాన్స్ తో పాటు– సినీ ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇక శ్రీలీల ఈ మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీ లీల ఈ సినిమాలో డిఫరెంట్‌గా రెండు జడలలో కనిపించింది. వరుస డిజాస్టర్స్ తర్వాత అటు అఖిల్ ఇటు శ్రీ లీల చేస్తున్న ఈ సినిమాతో సాలిడ్ హిట్ ఇస్తారని ఇరువురి ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.